క్లుప్తంగా

శాఖా గ్రంథాలయం సందర్శన



గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న శేఖర్‌బాబు

కొయ్యలగూడెం: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు మంగళవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయంలో రీడర్స్ ఫోరం ఏర్పాటు చేయాలని గ్రంథపాలకులు యు.రాముడుని ఆదేశించారు. పోటీ పరీక్షల పుస్తకాలన్నీ అందుబాటులో ఉన్నాయని, వాటిని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రంథాలయ సంస్థకు రూ.20 కోట్లు సేస్సు బకాయిలు రావాల్సుందని చెప్పారు. ఒక్క ఏలూరు పురపాలక సంఘం నుంచే రూ.9 కోట్లు సేస్సు బకాయిలు ఉన్నట్టు తెలిపారు. గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత ఉందని చెప్పారు.

నూతన గృహం ప్రారంభం



ప్రగడపల్లి గ్రామంలో గృహ తాళాలు అందిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో మంజూరైన రెండు గృహాలను కూటమి నాయకులు మంగళవారం ప్రారంభించారు. నరేంద్రమోదీ పుట్టిన రోజు సందర్భంగా పోలవరం మండలం ప్రగడపల్లి గ్రామంలో కె.శోభన్‌బాబు, జి.ఏసు లబ్ధిదారులు నూతనంగా నిర్మించిన గృహాల్లో గృహ ప్రవేశం చేసినట్టు ఇన్‌చార్జి ఏఈ హరి రాంబాబు తెలిపారు. ఈ పథకంలో 2021–22 సంవత్సరంలో మండలంలో 897 గృహాలు మంజూరు కాగా, 365 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని ఆయన వివరించారు. 297 గృహాలు ఇప్పటికే పూర్తయినట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే వీటి నిర్మాణాలు పూర్తికావడం గమనార్హం.

పీడీఎస్ బియ్యం పట్టివేత



జంగారెడ్డిగూడెంలో పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని బాట గంగానమ్మ లేఅవుట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, అక్రమంగా వ్యాన్‌లో సుమారు 340 కేజీల పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీ కుమారి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వక్కలగడ్డ అరవింద్‌కుమార్, పంపన సైదుబాబు, కోండ్రు కాశి ఫలనికుమార్ అలియాస్ ఫణిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయుడు సల్మాన్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

లింగపాలెం: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్న కలరాయనగూడెం పాఠశాల ఉపాధ్యాయుడు చందమాల సల్మాన్ రాజును మంగళవారం ధర్మాజీగూడెం కాంప్లెక్స్ సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ బీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విద్యార్థులను దేశ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లు నాగేశ్వరరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వావిలాలకు ఘన నివాళి



వావిలాలకు నివాళులర్పించిన చిన్నారులు

కొయ్యలగూడెం: స్వాతంత్ర్య సమరయోధులు దివంగత వావిలాల గోపాలకృష్ణయ్య 118వ జయంతి కార్యక్రమం మంగళవారం కుంతల గూడెం ఎంపీయూపీ స్కూల్లో నిర్వహించారు. వావిలాల చిత్రపటం వద్ద విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రాయపూడి వెంకటరమణ మాట్లాడుతూ వావిలాల ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారని గుర్తుచేశారు.

పరిసరాల పరిశుభ్రతతో పురోగతి



జంగారెడ్డిగూడెం : మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ



జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది క్షేత్రంలో శుభ్రం చేస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం : గణేష్ సెంటర్లో మానవహారం



చింతలపూడి : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

జంగారెడ్డిగూడెం: పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె ఆధ్వర్యంలో కౌన్సిలర్‌లు, అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని లక్ష్మి అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే పురోగతికి బీజాలు పడతాయని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని వివరించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచడం, గ్రీనరీని రూపొందించడం చేస్తామన్నారు. కార్యక్రమంలో నంబూరు రామచంద్రరాజు, ఉగ్గం దుర్గాప్రసాద్, నేట్రు సుబ్బలక్ష్మి, బత్తిన చిన్న, కమిషనర్ రమణ, ఏఈ సంధ్యా రాణి, నరసింహ, సచివాలయ సిబ్బంది, మెప్మా టీఎంసీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం మండలంలో..

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో అధికారులు, సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ పాల్గొన్నారు. శ్రీనివాసపురంలో ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఎంపీటీసీ తాతారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి నాని, టీడీపీ నాయకులు దాసరి శ్యాం చంద్రశేషు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ సెంటర్‌లో మానవహారం

కొయ్యలగూడెం: స్వచ్ఛతా హీ సేవ అవగాహన కార్యక్రమం మంగళవారం కొయ్యలగూడెంలో మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలలో స్వచ్ఛతా హి సేవపై అక్టోబర్ 2 వరకు అవగాహన కల్పిస్తామని ఎంపీడీఓ బేబీ శ్రీ లక్ష్మి తెలిపారు. ప్రభుత్వ స్కూల్స్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి గణేష్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపీపీ గంజిమాల రామారావు, ఈవోపీఆర్‌డీ జి.సతీష్ సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగపాలెంలో ప్రతిజ్ఞ

లింగపాలెం: మండలంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జె.రత్నసాగర్ ఆధ్వర్యంలో అధికారులు, గ్రామ పెద్దలు, నాయకులు, సచివాలయం సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. నాయకులు బొంతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యం

చింతలపూడి: పల్లెలు స్వచ్ఛంగా, ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ బి.రాంబాబు నాయక్ తెలిపారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం మాజీ జెడ్పీటీసీ తాళ్లూరి రాధారాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీ సర్పంచ్ తులిమెల్లి రాణి, ఎంపీటీసీ తులిమెల్లి విజయభాస్కర్, వైవీ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ వరలక్ష్మి, ఉప సర్పంచ్ వడ్లమని వెంకటేశ్వరరెడ్డి, గోలి సత్యనారాయణ రెడ్డి, తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్టిసీమ గ్రామంలో..

పోలవరం రూరల్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కొత్తపట్టిసీమ సర్పంచ్ మైగాపుల విజయదుర్గ అన్నారు. పోలవరం మండలం కొత్త పట్టిసీమ పంచాయతీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, కార్యదర్శి ఎ.సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తి



ద్వారకాతిరుమల : ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద శుభ్రం చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని శ్రీవారి దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు పిలుపునిచ్చారు. ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ఈఓ ప్రారంభించారు. షాపింగ్ కాంప్లెక్స్, తదితర ప్రాంతాలను ఈఓ త్రినాథరావు, ఈఈ డీవీ భాస్కర్ ఇతర అధికారులు, సిబ్బంది చీపుర్లు పట్టుకుని శుభ్రపరిచారు. తొలుత ఆలయ జంటగోపురాల వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఓ త్రినాథరావు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. భక్తులు పరిశుభ్రతను పాటిస్తూ, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఆలయ ప్రథమ చికిత్సా కేంద్రంలో వచ్చేనెల 2 వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు వాసు, పి.నటరాజారావు, ఆర్ లక్ష్మణస్వామి, సూపరింటెండెంట్‌లు రమణరాజు, హయగ్రీవాచార్యులు, జి.సుబ్రహ్మణ్యం, కిషోర్, డీవీఎస్ రాజు, మద్దాల శ్రీను, ఎలక్ట్రికల్ డీఈ టి.సూర్యనారాయణ, ఎస్‌వీఎస్ రాజు తదితరులున్నారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



కొయ్యలగూడెం : బయ్యన్నగూడెం హైస్కూల్లో విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న దృశ్యం



చింతలపూడి : విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందిస్తున్న దృశ్యం



పోలవరం రూరల్ : ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీలో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని మంగళవారం బయ్యన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నులి పురుగుల వల్ల రక్త హీనత, పోషకాహార లోపిస్తుందని, ఆకలి మందగించటం, కడుపులో నొప్పి, నీరసం, చదువు పట్ల శ్రద్ధ తగ్గటం, శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకం కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో బాలం నరేష్, ఆనెం సాయి, లింగి శెట్టి శ్రీనివాస్, కటికి రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు కె.రవికుమార్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగులతోనే అనారోగ్యం

చింతలపూడి: నులిపురుగుల వల్ల అనారోగ్య సమస్యలతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎం నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సుబ్బరాజు గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. విద్యార్థులకు నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలను నాగేశ్వరరావు వివరించారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతంపడిపోవడం, చదువుపై శ్రద్ధ చూపలేకపోవడం, శరీరంపై పాలిపోయిన మచ్చలు, తరచుగా కడుపులో నొప్పి రావడం వంటి సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. తరచుగా గోర్లు తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వల్ల అనేక రోగాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో చింతలపూడి అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అనిల్‌కుమార్, హెల్త్ విజిటర్ టీఎస్‌పీ కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఏఎన్ఎం కుమారి, హెల్త్ అసిస్టెంట్ బాలరాజు, ఆశాలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

పోలవరం రూరల్: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఎల్ఎన్‌డీపేట ఆరోగ్యకేంద్రం పరిధిలో 2,234 మంది పిల్లలకు ఈ మాత్రలు అందజేశామని వైద్యాధికారి కె.నిఖిల్ తెలిపారు. మిగిలిన 215 మందికి 25వ తేదీ లోగా అందజేస్తామని చెప్పారు. పీహెచ్ఎన్ పూనెం శ్రీలక్ష్మీదేవి, వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడులో గణేష్ ఊరేగింపును పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ నరసింహస్వామి తెలిపారు. భారీ వినాయక విగ్రహం విద్యుత్ వైర్లకు తగిలే అవకాశం ఉందని ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

సీఎస్‌టీఎస్‌లో ఓజోన్ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన ఓజోన్ డేని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఓజోన్ క్షీణతకు కారణమైన క్లోరో ఫ్లోరో కార్బన్స్ గురించి, వాటి వాడకం తగ్గిస్తే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కళాశాల ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్, రసాయన శాస్త్ర అధ్యాపకుడు ఎం మధు, ఎన్ఎస్ఎస్–1, –2 కోఆర్డినేటర్లు నిట్టా వినయ్, గల్లా శ్రీనివాసరావులు మాట్లాడుతూ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

20లోగా ఫీజులు చెల్లించాలి

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సిస్టం (ఏపీఓఎస్ఎస్) ద్వారా ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందే విద్యార్థులకు ఎటువంటి ఫైన్ లేకుండా ఈనెల 20వ తేదీలోపు ఫీజు చెల్లించాలని ఏపీవోఎస్ఎస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొయ్యలగూడెం వీఎస్ఎన్ కళాశాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. 20వ తేదీ తర్వాత రూ.200 ఫైన్‌తో ఫీజు చెల్లించాలని తెలిపారు. టెన్తలో జాయిన్ అయ్యే విద్యార్థులకు కూడా దీనిని వర్తింపజేసామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94411 71885లో సంప్రదించాలని కోరారు.

పార్టీ అధ్యక్షుడి ఎంపికపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కుక్కునూరు: వైఎస్సార్ సీపీ కుక్కునూరు మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు అనారోగ్య కారణాల రీత్యా అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో నూతన అధ్యక్షుడి నియామకానికి మంగళవారం కుక్కునూరు చర్చి హాస్టల్‌లో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్ష పదవికి ఆసక్తి చూపిన తాండ్ర రాజేష్, రాయి రవీందర్, ఐతా సురేష్, వేల్పుల రవి పేర్లతో తీర్మానం చేశారు. దీనిని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం బాలరాజు, జిల్లా అధ్యక్షుడికి అందజేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్ది అంజన్న సేవలో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. అర్చకులు స్వామి వారికి తమలపాకులతో పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. స్వామివారికి ఒక రోజు ఆదాయం రూ.1,18,100 వచ్చిందని, 1100 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

ఘనంగా గణేష్ ఊరేగింపులు

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు మంగళవారం మండల వ్యాప్తంగా గణేష్ ఊరేగింపు ఉత్సవాలు, నిమజ్జనోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సత్యసాయి నగర్‌లోని గణపతి శిబిరంలో స్వామివారికి ప్రసాదంగా సమర్పించిన లడ్డూలను నలుగురు భక్తులు వేలంలో దక్కించుకున్నారు. టేకుతోట గణపతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటుచేశారు. రాజవరం, బయనగూడెం, కన్నాపురం, కమ్యూనిస్టు నగర్, ఆటో స్టాండ్ గణపతి, నిమజ్జనోత్సవ కార్యక్రమాలు బుధవారం నిర్వహించనున్నారు.

ఘనంగా విశ్వకర్మ ఆరాధన యజ్ఞ మహోత్సవాలు



ద్వారకాతిరుమలలో విశ్వకర్మ చిత్రపటం ఊరేగింపు

ద్వారకాతిరుమల: మండల విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గాయత్రి సమేత విశ్వకర్మ ఆరాధనా, యజ్ఞ మహోత్సవాలను స్థానిక ఆళ్వార్ సదనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సుగంధభరిత పుష్పమాలికలతో విశ్వకర్మ చిత్రపటాన్ని అలంకరించారు. గాయత్రి సమేత విశ్వకర్మ చిత్రపటానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు సంఘ నేతలతో కలిసి పూజలు చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో విశ్వకర్మ చిత్రపటాన్ని ఉంచి, మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగించారు. సంఘ నేతలు రామాయణం కేశవాచారి, కొక్కొండ శ్రీనివాసరావు, ర్యాలి వెంకట్రావు, భగీరథ సత్యనారాయణ, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: దైవిక వాస్తుశిల్పి విరాట్ విశ్వకర్మ జయంతిని మంగళవారం జంగారెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. దుర్గాభవానీ కార్పెంటర్ వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పాల్గొన్నారు. విశ్వకర్మ యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, పెసరకంటి త్రిమూర్తులు, ఈర్ని సూరిబాబు, బత్తిన చిన్న, తాతాజీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

కొయ్యలగూడెం: శ్రీ విశ్వకర్మ భగవానుని యజ్ఞమహోత్సవాన్ని మంగళవారం స్థానిక వెంకయ్యపాలెం రోడ్డులోని శ్రీ కంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం భవనంలో నిర్వహించారు. బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు దంపతులు యజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలను సత్కరించారు. అధ్యక్షులు దార్ల రాంబాబు, ప్రధాన కార్యదర్శి జవాది శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పెద్దోజు శ్రీనివాసచార్యులు, సభ్యులు గుండెపల్లి చిన్న, కోటిపల్లి నాని గంగాధరుని బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

లింగపాలెం: ప్రపంచంలోనే మొట్ట మొదటి వాస్తు శిల్పి, సృష్టికర్త, భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని లింగపాలెం మండలం ధర్మాజిగూడెంలో విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ విశ్వకర్మ చిత్రం పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టైలరింగ్, కమ్మరి, కుమ్మరి, నేత, తాపీ, వివిధ చేతి వృత్తి నైపుణ్యాలు గల కుటుంబాల వారికి విశ్వకర్మ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం సాధికారిత కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వివరించారు. అవసరమైన వారికి వృత్తి నైపుణ్యం పెంచేందుకు శిక్షణ అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో ఉపాధ్యాయుల విజయభేరి

జంగారెడ్డిగూడెం: యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీల్లో జంగారెడ్డిగూడెం డివిజన్ ఉపాధ్యాయులు అత్యధిక అంశాల్లో విజేతలుగా నిలిచారని డివిజన్ కమిటీ కన్వీనర్ ఎంవీ శ్యాంబాబు తెలి పారు. విజేతలకు ఆయన అభినందించారు. మహిళలు విభాగం టెన్నికాయిట్‌లో ఎస్ విజయశాంతి (జంగారెడ్డిగూడెం మండలం), ఎం రామ తులసి (బుట్టాయిగూడెం మండలం), షటిల్‌లో ఎస్ విజయశాంతి (జంగారెడ్డిగూడెం మండలం), ఎం రామ తులసి (బుట్టాయిగూడెం మండలం) ప్రథమ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. షాట్ పుట్‌లో ఎస్ విజయ శాంతి (జంగారెడ్డిగూడెం మండలం) రెండో స్థానం, ఎం రామతులసి (బుట్టాయిగూడెం మండలం) మూడో స్థానం, జావలిన్ త్రో లో ఎం రామ తులసి (బుట్టాయిగూడెం మండలం) రెండో స్థానంలో నిలిచారని వివరించారు.

పురుషుల విభాగం : 100 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో ఇ.ఆనంద్ (వేలేరుపాడు మండలం), బి.మణికంఠ (పోలవరం మండలం), 200 మీటర్స్ రన్నింగ్ రేస్‌లో ఈ.ఆనంద్ (వేలేరుపాడు మండలం), బి.దిలీప్ (బుట్టాయిగూడెం మండలం) ప్రథమ, ద్వితీయ స్థానాల్లో, షాట్ పుట్‌లో బి.మణికంఠ (పోలవరం మండలం), కె.కమల్ కుమార్ (కుకునూరు మండలం), టి.పోసి (వేలేరుపాడు మండలం) మొదటి మూడు స్థానాలు సాధించారని తెలిపారు. జావెలిన్ త్రో లో కె.భీమరాజు (పోలవరం మండలం), ఎండీ ముష్బర్ (బుట్టాయిగూడెం మండలం) ప్రథమ, ద్వితీయ, క్యారమ్స్‌లో రాయపూడి వెంకటరమణ (కొయ్యలగూడెం మండలం), కె. సుబ్బారావు (కొయ్యలగూడెం మండలం) ద్వితీయ, క్రికెట్‌లో జంగారెడ్డిగూడెం డివిజన్ టీం, వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించారని వివరించారు.

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం

కొయ్యలగూడెం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షల విరాళాన్ని మంగళవారం అందజేసినట్టు ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొలస సుధాకర్ తెలిపారు. ఈ మొత్తాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫ్లెక్స్ ప్రింటర్ల కేంద్రాల నుంచి సేకరించామని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ రాజశేఖర్, నేతలు మహదేవ్, పృథ్వి, నాగబాబు, ఖాజావలి తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

వ్యాపారుల వితరణ

చింతలపూడి: విజయవాడ వరద బాధితుల కోసం చింతలపూడి గోల్డ్ షాప్ యూనియన్ వ్యాపారులు ముందుకు వచ్చారు. యూనియన్ తరుపున సేకరించిన రూ.50 వేలను మంగళవారం ఎమ్మెల్యే స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు వారు అందజేశారు. ఆ సొమ్మును సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు.